# తొలి అక్షరం

చైర్మెన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 97 పేజీలు - 6 శనివారం 01 మార్చి 2025


## జాతీయ పసుపు బోర్డు కార్యదర్శిగా ఎన్.భవాని..



**తొలిఅక్షరం/నిజామాబాద్:** జాతీయ పసుపు బోర్డుకు కార్యదర్శిగా ఎన్.భవాని (ఐఏఎస్) నియమితులయ్యారు. ఈ మేరకు 2017వ బ్యాచ్ నాగాలాండ్ కేడర్ కి చెందిన ఎన్.భవాని (ఐఏఎస్)ను జాతీయ పసుపు బోర్డు కార్యదర్శిగా నియమిం చినట్లు వాణిజ్య, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్ కుమార్ శుక్రవారం తెలిపారు.సుగంధ ద్రవ్యాల బోర్డు డైరెక్టర్ (పరిశోధన) డాక్టర్ ఎ.బి. రెమాశ్రీ, సుగంధ ద్రవ్యాల బోర్డు జాతీయ పసుపు బోర్డు మధ్య కార్యకలాపాలను సమన్వయం చేస్తారు.



☛దేశ ప్రగతి, రక్షణకు నూతన ఆవిష్కరణలు అవసరం ☛గచ్చిబౌలిలో నేషనల్ సైన్స్‌డే ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ☛ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

# దేశ రక్షణలో హైదరాబాద్ కీలకం

**తొలిఅక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి28:** దేశాన్ని రక్షించడంలో హైదరాబాద్ అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం నేషనల్ సైన్స్ డే ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎగ్జిబిషన్‌ను కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. డీఆర్‌డీవో, డిఫెన్స్, ఏరోస్పేస్ ఉత్పత్తులకు చెందిన 200 స్టాల్స్ ప్రదర్శించారు. డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో భారత సామర్థ్యాలను ప్రదర్శించేలా స్టాల్స్ ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు నేషనల్ సైన్స్ డే ఎగ్జిబిషన్ జరగనుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ దేశ రక్షణ బాధ్యత యువతీ యువకులపై ఉందని చెప్పారు. బీడీఎల్, డీఆర్డీఓ, మిదానీ, హెచ్‌ఏఎల్ వంటి దేశ రక్షణ కోసం రాకెట్లు, మిస్సైల్స్ తయారు చేస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్ నగరం, హైదరాబాద్ చుట్టూ పరిశ్రమలు ఉన్నాయన్నారు. లక్షలాది మంది విద్యార్థులకు దేశభక్తి , దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యతపై వారిలో స్ఫూర్తిని, అవగాహన కల్పించడానికి ఈ ప్రత్యేకమైన ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రతి ఏటా లక్షకుపైగా ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు, ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ చదివి, అమెరికాకు వివరాలు 2లో

# కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువే

☛విభేదాలు అన్నవి ఉత్తిమాటలేనన్న మీనాక్షి

☛లేక్‌వ్యూలో మీనాక్షిని మర్యాదపూర్వకంగా కలిసిన సిఎం




**తొలిఅక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి28:** పార్టీలో ఎలాంటి అంతర్గత విభేదాలు లేవు.. మా పార్టీలోనే ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉందని కాంగ్రెస్ పార్టీ కొత్త ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ అన్నారు. తెలంగాణలో పనిచేసే అవకాశం వచ్చింది.. పీసీసీ చీఫ్, సీఎం, ఇతర నేతలు, కార్యకర్తలను కలుపుకొని పనిచేస్తానన్నారు. పార్టీ పటిష్టతకు, రాజ్యాంగ పరిరక్షణకు అందరం కలిసి పనిచేస్తామన్నారు. పార్టీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతలను నెరవేరుస్తానని చెప్పారు. రాహుల్ గాంధీ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లధానికి కృషి చేస్తానన్నారు. శుక్రవారం లేక్‌వ్యూలో వివరాలు 2లో

# సొరంగ ప్రమాదంలో 8 మంది సజీవ సమాధి

☛అత్యాధునిక రాడార్‌తో గుర్తించిన అధికారులు

☛బురదలో కూరుకు పోయిన వారి శవాలు

☛బయటకు తీసుకుని వచ్చేందుకు శ్రమిస్తున్న సిబ్బంది



**తొలిఅక్షరం/నాగర్‌కర్నూలు,ఫిబ్రవరి28:** శ్రీశైలం లిఫ్ట్ బకింగ్ కెనాల్ టన్నెల్‌లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో ఎనిమిది మంది సజీవ సమాధి అయ్యారు. మృతుల్లో ఆరుగురు కార్మికులు, ఇద్దరు ఇంజనీర్లు ఉన్నారు. ప్రమాదం జరిగినప్పటి నుంచే అధికారులు, రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగి క్షతగాత్రుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. మట్టిలో వారు మూడు మీటర్ల లోతులో కూరుకుపోయినట్లు అధునాతన పరికరాలు సూచించాయి. వీరు బతికి వివరాలు 2లో



# 2న నగరంలో ఉపరాష్ట్రపతి పర్యటన

**భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సిఎస్ సమీక్ష**

**తొలిఅక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి28:**మార్చి 2వ తేదీన రాష్ట్రంలో ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కడ్ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా తగిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో వివరాలు 2లో

# మామునూరు ఎయిర్‌పోర్టుకు రెక్కలు

☛విమానాశ్రయ విస్తరణకు కేంద్రం ఆమోదం

☛ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



**తొలిఅక్షరం/న్యూఢిల్లీ,28:** వరంగల్ నగర ప్రజలకు కేంద్రం శుభవార్త అందించింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఎయిర్‌పోర్ట్ కలనినెరవేర్చింది. వరంగల్ జిల్లాలోని మామూ నూర్‌లో విమానాశ్రయ అభివృద్ధికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతి ఇవ్వడంపై సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి కొండ సురేఖ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శంషాబాద్ నుంచి 150 కిలోమీటర్ల దూరంలో మరో ఎయిర్‌పోర్టు ఉండరాదని జిఎంఆర్ సంస్థ గతంలో ఒప్పందం చేసుకుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం, రామ్మోహన నాయుడు జరిగిన చర్చల తర్వాత జిఎంఆర్ వివరాలు 2లో

## రాష్ట్రంలో అస్తవ్యస్తంగా కాంగ్రెస్ పాలన : కేటీఆర్



**తొలిఅక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి28:** రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందని, ఏరంగం సంతోషంగా లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాపాలన పరాకాష్టకు చేరిందని అన్నారు. విషాదంలోనూ మంత్రులు వినోదం పొందుతున్నారని కేటీఆర్ నిప్పులు చెరిగారు. హెలికాప్టర్ యాత్రలు చేస్తూ.. చేపకూర విందులతో ఎంజాయ్ చేస్తున్నారంటూ కాంగ్రెస్ మంత్రులపై కేటీఆర్ విరుచుకుపడ్డారు. హాస్టల్ విద్యార్థులకు మాత్రం అన్నం పెట్టకుండా పస్తులు ఉంచుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. విద్యార్థులకు కనీసం తిండి పెట్టలేని దుస్థితిలో రేవంత్ ప్రజా ప్రభుత్వం ఉందన్నారు. “అన్నం వండలేదు గుడిలో తినండి” అని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూరు మండలం కొండనాగుల ఎస్టీ బాలుర హాస్టల్ సిబ్బంది విద్యార్థులకు ఆదేశాలు ఇవ్వడం దారుణమన్నారు. కొండనాగులలోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో శివరాత్రి పండుగ రోజు 380 మందికి గాను 200 మంది వివరాలు 2లో

# మహిళల కోసం మినీ ఇండస్ట్రియల్ పార్క్

☛దళిత పారిశ్రామికవేత్తలకు మరింత ప్రయోజనం


☛ఫిక్కీ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



**తొలిఅక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి28:** రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళల కోసం మినీ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తామని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు, పారిశ్రామికవేత్తలు, అధికారులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమిస్తాం. వివరాలు 2లో

## కేబీఆర్ పార్కు విస్తరణ పనులపై హైకోర్టులో విచారణ

- పిటిషనర్ల వినతి స్వీకరించి తగు నిర్ణయం తీసుకోవాలని ఆదేశం




# భాజాపా పాలనలో అణచివేత విధానాలు

- పిసిసి విస్తృత స్థాయి సమావేశంలో ఉత్తమ్



# కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి 9 పేజీల లేఖ

☛ప్రాజెక్టుపై కిషన్‌రెడ్డిని, ప్రధానిని కలిసిన విషయాన్ని గుర్తుచేసిన రేవంత్☛మెట్రో విస్తరణకు ఐదు కారిడార్ల ప్రతిపాదలను చేశామని వివరణ☛తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని లేఖలో పేర్కొన్న సీఎం



**తొలిఅక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి28:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి 9 పేజీల లేఖ రాశారు. ‘తెలంగాణ రాష్ట్రానికి ప్రాజెక్టుల మంజూరులో కేంద్ర క్యాబినెట్ మంత్రిగా మీ బాధ్యతను గుర్తు చేయడం కోసం లేఖ’ అని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రాలకు ప్రాజెక్టుల మంజూరులో సీఎం రేవంత్ రెడ్డి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారన్న వ్యాఖ్యలు పూర్తి బాధ్యతారాహిత్యమని, తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రిగా తెలంగాణకు కిషన్ రెడ్డి ఏం చేశారో వివరాలు 2లో

## హరీశ్‌రావుపై మరో కేసు నమోదు

తొలిఅక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి28:బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావుపై మరో కేసు నమోదు అయింది. బాచుపల్లి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. హరీష్‌రావు, ఆయన అనుచరులు బెదిరిస్తున్నారని కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఏ -1 గా వంశీ కృష్ణ, ఏ -2 గా హరీష్‌రావు, ఏ-3 సంతోష్‌కుమార్, ఏ-4గా పరుశురాములు పేర్లు చేర్చారు. బీఎస్ఎన్ యాక్ట్‌ప్రకారం కేసు నమోదు చేసిన బాచుపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బాబూ రాజేంద్రప్రసాద్‌కు సిఎం రేవంత్ నివాళి

తొలిఅక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి28: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ వర్ధంతి సందర్భంగా జాతి ఆయనకు నివాళి అర్పించింది. రాజ్యాంగపరిషత్ ఛైర్మన్‌గా, స్వతంత్ర భారత తొలి రాష్ట్రపతిగా ఆయన జాతికి సేవ చేశారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఆబూ సేవలను స్మరించుకున్నారు.

## 2న నగరంలో ఉపరాష్ట్రపతి పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

పని చేస్తూ తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆమె సూచించారు. కాగా ఉపరాష్ట్రపతి హైదరాబాద్ లోని ఐఐటిని సందర్శించి అక్కడి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులతో ముచ్చటిస్తారని సిఎస్ తెలియజేశారు. అనంతరం నగరంలోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో కూడా పాల్గొని అదే రోజు తిరిగి న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. ఉపరాష్ట్రపతి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు సి.ఎస్ సూచించారు. ఆర్ అండ్ బి శాఖ, పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వైద్యారోగ్య శాఖకు అర్హులైన వైద్యులు, ఇతర సామాగ్రి అందుబాటులో ఉంచాలని సూచించారు. అదేవిధంగా, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖకు చెప్పారు. ఈ సమావేశంలో హోం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా, ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, పొలిటికల్ సెక్రటరీ రఘునందన్ రావు, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ ఎస్ హరీష్, హైదరాబాద్, సంగారెడ్డి కలెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి.

## రాష్ట్రంలో అస్తవ్యస్తంగా కాంగ్రెస్ పాలన : కేటీఆర్


(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులు ఉన్నారు. అయితే మధ్యాహ్న భోజనం గుడిబండ శివాలయంలో చేసే అన్నదానానికి వెళ్ళి తినాలని, రాత్రి భోజనం కోసం వీరం రామాజిపల్లిలోని గంగమ్మ దేవాలయంలో అన్నదానానికి వెళ్లి తినమని విద్యార్థులకు చెప్పి హాస్టల్ సిబ్బంది వంట చేయడం మానేశారని కేటీఆర్ తెలిపారు. భోజనం కోసం అంత దూరం నడిచి వెళ్ళే ఓపిక లేక విద్యార్థులు పస్తులు ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. పండగ పూట విద్యార్థులకు కనీసం భోజనం పెట్టకుండా, అన్ని కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్ళి తినమని చెప్పడం ఏంటి అని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పండగపూట విద్యార్థులను పస్తులుంచడమే ప్రజాపాలనా అని కేటీఆర్ ప్రశ్నించారు.

## భాజాపా పాలనలో అణచివేత విధానాలు

### - పిసిసి విస్తృత స్థాయి సమావేశంలో ఉత్తమ్

తొలిఅక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి28:సమాజంలో అన్ని వర్గాలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. భాజపా పాలనలో దేశంలో అన్ని విధాలుగా అణచివేత కొనసాగుతోందని ఆరోపించారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. ఇప్పుడు జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమం అవసరమని వివరించారు. రాష్ట్రంలో కులగణన, ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కుటుంబ సర్వేలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం కూడా సామాజిక న్యాయం గురించి మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. ఏడాది కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని.. ప్రచారం చేయడంలో కొంత వెనుకబడిపోయామని తెలిపారు. దేశం మొత్తంలో తెలంగాణలోనే ఈ ఏడాది ఎక్కువ ధాన్యం పండించినట్లు పేర్కొన్నారు. అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని.. ఇవన్నీ జనంలోకి తీసుకెళ్లి ప్రచారం చేసుకోవాలని వివరించారు. పీసీసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లు పాల్గొన్నారు.



## దేశ రక్షణలో హైదరాబాద్ కీలకం

(మొదటి పేజీ తరువాయి)

వెళ్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. వారిలో దేశభక్తితో, దేశ రక్షణ ప్రాధాన్యతనలు వివరించడానికి ఈ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నామని అన్నారు. తెలంగాణ నుంచి కేవలం ఐటీ ప్రొఫెషనల్స్ మాత్రమే అమెరికాకు వెళ్లకుండా, దేశ రక్షణ రంగానికి అవసరమైన సమర్థవంతమైన ఇంజినీర్లు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. దేశ రక్షణ కోసం అవసరమైన ఇంజినీర్లను తయారుచేయడం మరింత ముఖ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత కూడా హైదరాబాద్‌లో బీడీఎల్, హెచ్ఎఎల్, మిదాని, డీఆర్డీఓ వంటి అనేక సంస్థలు దేశ రక్షణ కోసం ఉత్పత్తి రంగంలో విశేషంగా పని చేస్తున్నాయని తెలిపారు. దేశ రక్షణ రంగానికి హైదరాబాద్, బెంగళూరు ముఖ్య కేంద్రాలుగా ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. గతంలో మీతో చర్చించినట్లుగా హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రీయల్ కారిడార్‌గా ప్రకటించాలని.. తద్వారా భారీగా పెట్టుబడులు వస్తాయని అన్నారు. రాకెట్ తయారీ సహా ఆకాశ మార్గం (స్కై రూట్) వంటి స్టార్టప్‌లు అభివృద్ధి చెందుతాయని.. అందుకోసం కేంద్ర ప్రభుత్వ సహకారం, మద్దతు అవసరమని తెలిపారు. రక్షణ రంగంలో భారతదేశాన్ని నంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లేందుకు తాము ప్రయత్నిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువే

(మొదటి పేజీ తరువాయి)

బసలచేసిన ఆమెను సిఎం రేవంత్, మంత్రి పొన్నంలు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీలో అంతర్గత రాజకీయాలు లేవు.. ప్రజాస్వామ్యం కాంగ్రెస్ లో ఎక్కువ..పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయి.. అందరి అభిప్రాయాలకు సముచితస్థానం కల్పిస్తూ ముందుకెళ్తామన్నారు. తెలంగాణను సోనియా గాంధీ ఏ ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశారో..ఆ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. ఇక కొత్త ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ చాలా సాదా సీదా వ్యక్తి. దిల్ కుష్ తో కార్యాలయ బయట కార్యకర్తలను కలిసి విష్ చేశారు. బొకేలు ఇస్తుంటే నిరాకరించారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ బ్రహ్మచారిణి. చాలా సాదా సీదాగా ఉంటారు. అత్యవసర మీటింగులకు, రాహుల్ ఇతర రాష్ట్రాల్లో ఉన్నప్పుడు అత్యవసర పిలుపు వస్తే మినహా ఆమె విమాన ప్రయాణం చేయరని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఆమె ఇడ్లీయే ఆమె బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ అని తెలుస్తోంది. కేవలం రెండు జతల బట్టలే వాడుతారని అంటున్నారు. స్వాగతాలు, సన్మానాలు, బొకేలకు చాలా దూరంగా ఉంటారు. శనివారం మౌన వ్రతం పాటిస్తారు. గాంధేయ సిద్ధాంతంలో భాగం. ఆ రోజు ఎవరితో మాట్లాడరని, కేవలం సంజ్ఞల తోనే నడిపిస్తారని అంటున్నారు. కాన్వాయ్ ప్రయాణానికి దూరం సాధారణంగా ఆమె ఆటోలో వెళ్లేందుకు ప్రయార్టీ ఇస్తారు. ఎక్కడైనా రాత్రి బస చేయాల్సి వస్తే సొంత ఖర్చులతో మాజీ ఎంపీ హోదాలో ప్రభుత్వ అతిథి గృహంలో ఉంటారు. ఈ నేపథ్యంలో ఇవ్వాళ రాత్రి కూడా దిల్ కుశా గెస్ట్ హౌస్ లో ఆమె బస చేయ నున్నారు. ఇందుకోసం ఆమె నేరుగా ఆన్ లైన్ లోనే రూ. 50 చెల్లించి ఓ గదిని బుక్ చేసుకున్నారు. గ్రూప్ మీటింగులు తప్ప పర్సనల్ మీటింగ్స్ కు దూరం. సమయ పాలన కచ్చితంగా పాటిస్తారు.

## మామునూరు ఎయిర్‌పోర్టుకు రెక్కలు


(మొదటి పేజీ తరువాయి)

సంస్థ కూడా ఎలాంటి అభ్యంతరం లేదని తెలపింది. దీంతో విమానాశ్రయ పనులు చేపట్టేందుకు పౌర విమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఎయిర్‌పోర్ట్ పరిధిలో 696 ఎకరాల స్థలం ఉంది. ఆ భూమికి అదనంగా మరో 253 ఎకరాల భూమి కొంత రన్‌వే విస్తరణ, టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ), నేవిగేషన్ ఇన్‌స్ట్రుమెంట్ ఇన్‌స్టలేషన్ నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ మేరకు భూసేకర జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు మామూనూరు ఎయిర్ పోర్ట్ ఆపరేషన్స్‌కి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు ఇచ్చారు. జీఎంఆర్ అంగీకారం తెలపడంతో విమానాశ్రయం పనులు చేపట్టేందుకు పౌరవిమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని ఎయిర్ పోర్ట్ అథారిటీని రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న 150 కి.మీ. ఒప్పందాన్ని జీఎంఆర్ సంస్థ విరమించుకుంది. నిజాం కాలంలో మామునూరు నుంచి వాయుదూత్ విమానాలు నడిచేవి. భారత్, చైనా యుద్ధ సమయంలో కీలక సేవలందించాయి. దాదాపు 32 ఏళ్ల కిందట మూతపడిన మామునూరు విమానాశ్రయానికి మళ్లీ 'రెక్కలు' రానున్నాయి. అప్పుడప్పుడు శిక్షణ ఎయిర్‌క్రాఫ్ట్‌లు నడుస్తున్న ఈ విమానాశ్రయం నుంచి మళ్లీ విమానం ఎగరనుంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మామునూరు ఎయిర్‌పోర్టు కల సాకారమైందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం అవుతాయన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతి తెలపడం పట్ల మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్ర పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

## కేబీఆర్ పార్కు విస్తరణ పనులపై హైకోర్టులో విచారణ

### ● పిటిషనర్ల వినతి స్వీకరించి తగు నిర్ణయం తీసుకోవాలని ఆదేశం

తొలిఅక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి28:నగరంలోని కేబీఆర్ పార్కురహదారి విస్తరణకు సంబంధించి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. రహదారి విస్తరణ వల్ల 306 ఇళ్లు, వ్యాపార సముదాయాలు కోల్పోతున్నామని రోడ్డు నెం 92లో ఉన్న కాలనీవాసుల పిటిషన్ వేశారు. 100 నుంచి 120 ఫీట్ల వరకు విస్తరణ చేపడుతున్నారనట్లు పిటిషనర్లు తెలిపారు. విరించి ఆస్పత్రి చౌరస్తా నుంచి కేబీఆర్ పార్కు మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు విస్తరణ చేయాలని నిర్ణయించారని, రహదారి విస్తరణపై సీఎస్, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చామని కాలనీవాసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇళ్లకు, వ్యాపార సముదాయాలకు మార్కింగ్ వేస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రహదారికి మరోవైపు ప్రభుత్వ భూమియే ఉందన్నారు. అటువైపే పూర్తిగా విస్తరణ చేపడితే నష్టం తగ్గుతుందని పిటిషనర్లు కోర్టుకు తెలిపారు. దీనిపై విచారించిన హైకోర్టు.. మరోసారి జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం ఇవ్వాలని పిటిషనర్లను ఆదేశించింది. పిటిషనర్ల వినతిపత్రాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌కు న్యాయస్థానం ఆదేశిస్తూ.. పిటిషన్లపై విచారణ ముగించింది.



## 6న తెలంగాణ కేబినేట్ భేటీ

### ● పలు కీలక అంశాలపై చర్చ



తొలిఅక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి28: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మార్చి 6వ తేదీన నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగనుంది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. రాష్ట్రంలో రెండో దఫా కులగణన నిర్వహించిన నేపథ్యంలో వాటికి సంబంధించిన గణాంకాలపై కేబినెట్ చర్చించనుంది. అలాగే బిసిలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు మార్చిలో ప్రత్యేకంగా అసెంబ్లీని సమావేశపరుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఈ అంశాలపై కూడా మంత్రి మండలి చర్చించే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. అలాగే రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారికి కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ కారణంగా పలు జిల్లాల్లో ఈ విషయంలో తర్జనభర్జన జరుగుతోంది. మార్చి 3వ తేదీతో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియనుంది. దీంతో కొత్త రేషన్ కార్డుల పంపిణీపై కేబినెట్‌లో చర్చించే అవకాశం ఉందని సమాచారం. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు పలు అంశాలపై కేబినెట్ నిర్ణయం తీసుకోనున్నట్లుగా తెలిసింది.

## సొరంగ ప్రమాదంలో 8 మంది సజీవ సమాధి

(మొదటి పేజీ తరువాయి)

ఉంటారన్న ఆశతో చేపట్టిన పనులకు అవరోధాలు కలిగినా ముందుకు సాగారు. గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ మెషీన్ ద్వారా మట్టిలో కూరుకుపోయిన 5 మృతదేహాలు గుర్తించారు. ఈ 5 మృతదేహాలను వెలికి తీయడానికి మరి ంత సమయం పడుతుందని, కొన్ని మీటర్ల లోతు మట్టిలో మృతదేహాలు కూరుకు పోయి నట్లు తెలుస్తోంది. మిగతా ముగ్గురి మృత దేహాల కోసం గాలిస్తున్నారు .ప్రమాద స్థలం లో రక్షణ చర్యలను వేగవంతం చేసేందుకు నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రంగంలోకి దిగింది. భూమిలో కూరుకు పోయిన వారి స్థితిని తెలుసుకు నేందుకు ఆధునిక టెక్నాలజీని ఉపయోగి స్తోంది. జీరో గ్రావిటీ పెనట్రేటింగ్ రాడార్ టెక్నాలజీని ఉపయోగించి, భూమిలోకి తొలగిపోయిన వారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందం శ్రమిస్తోంది. మిషన్ ఆధారంగా ఎన్జీఆర్ఐ బృందం టన్నెల్‌ను పూర్తిగా స్కాన్ చేసింది. దీని సాయంతో టన్నెల్‌లో ఐదు అనుమానాస్పద ప్రదేశాలను గుర్తించింది. ఈ ప్రాంతాల్లో శరీర నిఘా కోసం మార్కింగ్ నిర్వహించారు. రక్షణ బృందాలు ఆచూకీని కనుగొని, బాధితుల మృతదేహాలను వెలికితీసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

## మహిళల కోసం మినీ ఇండస్ట్రియల్ పార్క్

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక బృందం ఇచ్చే నివేదిక ఆధారంగా దళిత పారిశ్రామికవేత్తలకు మరింత ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటామని శ్రీధర్‌బాబు తెలిపారు. ఫిక్కిలో నిర్వహించిన తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రైజెస్ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇండస్ట్రియల్ పార్కుల్లో ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు 10 శాతం ప్రత్యేకంగా కేటాయిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలు ఎదిగితేనే సమాజం అభివృద్ధి చెందుతుంది. చేవెళ్ల డిక్లరేషన్‌లో దళితులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం కచ్చితంగా నెరవేరుస్తుంది. దళితుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమే. ఓవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూనే.. మరోవైపు సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాం. పారిశ్రామికవేత్తలకు రాయితీగా అందాల్సిన బకాయిలు రూ.4500 కోట్లకు పైనే ఉన్నాయి. వీటిలో రూ.2,200 కోట్లు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకే రావాల్సి ఉంది. మేం అధికారంలోకి రాగానే ఈ బకాయిల చెల్లింపుపై దృష్టి సారించాం. వచ్చే నెలలో రూ.300 కోట్లు చెల్లిస్తాం. ఎక్కువ మంది కార్మికులకు ఉపాధి అందించే ఎంఎస్ఎంఈ ప్రత్యేక పాలసీ తీసుకొచ్చాం. స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేసి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను అందిస్తాం. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. రుణాలు పొందటంలో ఔత్సాహిక ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తాం. తమిళనాడు, కర్ణాటకలో పారిశ్రామిక విధానాలపై అధ్యయనం చేయడానికి కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు.

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి 9 పేజీల లేఖ

(మొదటి పేజీ తరువాయి)

చెప్పాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి హైదరాబాద్ మెట్రో ఫేజ్, ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్), మూసీ పునరుజ్జీవనం, రీజినల్ రింగ్ రైలు, డ్రైపోర్ట్ ఏపీలోని బందరు సీ పోర్టుకు గ్రీన్ ఫీల్డ్ రహదారి కీలకమని అన్నారు. వాటి నిర్మాణాలకు సంబంధించి అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వ విధివిధానాలను పూర్తిగా పాటిస్తున్నామని తెలిపారు. ఆయా ప్రాజెక్టుల సాధన కోసం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులతో పాటు మిమ్మల్ని (కిషన్ రెడ్డి) కలిసిన విషయాన్ని గుర్తు చేస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మెట్రో ఫేజ్ -1 69 కి.మీ. నిర్మాణాన్ని ఉమ్మడి రాష్ట్రంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. మెట్రో రాకతో హైదరాబాద్ నగరంలో అభివృద్ధి పరుగులు పెట్టిందని, గత పదేళ్లలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 ప్రాజెక్ట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, సీఎంగా తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత హైదరాబాద్ మెట్రో ఫేజ్-11 ప్రాజెక్టుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించామని తెలిపారు. మెట్రో సేవలను విస్తరించడమే లక్ష్యంగా అయిదు కారిడార్లను ప్రతిపాదించామన్నారు. నాగోల్- రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (36.8 కి.మీ.), రాయదుర్గం-కోకాపేట నియోపొలిస్ (11.6 3.2.), ఎంజీబీఎస్- చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్-పటాన్ చెరు (13.4 కి.మీ.), ఎల్‌బీనగర్- హయత్ నగర్ (7.1 కి.మీ.). ఈ ఐదు కారిడార్ల నిర్మాణానికి రూ. 24,269 కోట్లతో ప్రతిపాదనలు ఆమోదించాలని నాటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీకి (2024, జనవరి 4వ తేదీ) వినతిపత్రం అందజేశామని చెప్పారు. 2024, అక్టోబరు ఏడో తేదీన ప్రస్తుత కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్కు ప్రతిపాదనలు అందజేశామని తెలిపారు. 2024, నవంబరు నాలుగో తేదీన రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు మెట్రో ఫేజ్- 11 డిటైయిల్డ్ రిపోర్ట్ సమర్పించామని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 2024, డిసెంబరు 12వ తేదీన ఢిల్లీలో తాను మీతో (కిషన్ రెడ్డి) సమావేశమై హైదరాబాద్ మెట్రో ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాల లేఖను అందజేశానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసినప్పుడు 2025, ఫిబ్రవరి 26వ తేదీన ఇదే అంశంపై లేఖ అందజేశానన్నారు. మెట్రో ఫేజ్-కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టాలని అన్ని లేఖల్లో స్పష్టంగా వివరించినట్లు ఆయన తెలిపారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు సహకరించాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను 2024, జులై 22న కలిసి వివరాలతో కూడిన లేఖను అందజేశామన్నారు. మీతో (కిషన్ రెడ్డి) సమావేశమైన రోజు మూసీ పునరుజ్జీవన ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు సమగ్ర వివరాలతో లేఖను అందజేశానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ నెల 21వ తేదీన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ అధికారుల బృందం మిమ్మల్ని కలిసి మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారన్నారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మూసీ పునరుజ్జీవంపై లేఖను అందజేశానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**తొలిఅక్షరం/ఫిబ్రవరి 28 (నర్సంపేట):** నర్సంపేట పట్టణ కేంద్రంలోని స్థానిక డిగ్రీ కళాశాల(అటానమస్)జాతీయ సైన్స్,దినోత్సవాన్ని పురస్కరించుకొని రసాయనశాస్త్రం, భౌతిక శాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ అధ్యక్షత వహించగా డా.కందాల సత్యనారాయణ కన్వీనర్ గా వ్యవహరించడం జరిగింది ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ...శాస్త్రవేత్తల కృషి ఫలితంగా సైన్స్,టెక్నాలజీ అందరికీ అందుబాటులోకి వచ్చిందని రామన్ యొక్క కృషి మరువలేనిదని విద్యార్థులందరూ రామన్ యొక్క సిద్ధాంతాలను, సాధించిన విజయాలను స్ఫూర్తిగా పొంది భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ బైరి సత్యనారాయణ మాట్లాడుతూ సైన్స్ నిజజీవితంలో అంతర్భాగమైందని ప్రతి ప్రాణి సైన్స్ మీదనే ఆధారపడి ఉందని కావున విద్యార్థులు సైన్స్ పట్ల మరింత ఆసక్తిని పెంచుకొని నూతన ఆవిష్కరణలకు పూనుకోవాలని తెలిపారు. డాక్టర్ కందాల సత్యనారాయణ సర్ సి.వి. రామన్ సాధించిన విజయాలను వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను ప్రధానంచేసారు . కార్యక్రమంలో డాక్టర్ భద్రు భూక్య, డాక్టర్ ఎం సోమయ్య, ఎస్ కమలాకర్ ,ఎంఎంకె రైముద్దీన్, డాక్టర్ రాజీరు, డాక్టర్ సంధ్య,రజిత,మాధవి,డా.పూర్ణచందర్, వీరన్న, మాధవి, భార్గవి,లక్ష్మి,దివ్య ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సైన్స్ దినోత్సవం



**తొలి అక్షరం/నెక్కొండ ఫిబ్రవరి 28:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అప్పాలరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిoచారు. సైన్స్ డే ని పురస్కరించుకొని విశ్వవిఖ్యాత శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత సర్ సివి రామన్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు రవీందర్, సైన్స్ ఉపాధ్యాయులు శ్రవణ్ కుమార్, గీత తదితరులు పూలమాలవేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు వర్కింగ్ మోడల్స్ ,ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. పాఠశాల ప్రయోగశాలలో ఉన్న ఉపకరణాలను ప్రదర్శించి సహచర విద్యార్థులకు వాటి ఉపయోగాలను వివరించారు. మానవ శరీరంలోని వివిధ అవయవాల పనితీరును వివరిస్తూ విద్యార్థులు రూపొందించిన మోడల్స్ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ బయోలాజికల్ సైన్స్ లో క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్రనాథ్ భూలక్ష్మి యాకయ్య దయాకర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహాల ధ్వంసంపై విచారణ చేయండి

**- గిరిజన యువ నాయకుడు ఆకాష్ నాయక్**

**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి28:** లోయపల్లి, ఇబ్రహీంపట్నం రంగారెడ్డి జిల్లాలోని, శ్రీ సంత్ సేవలల్ మహారాజ్, జగదంబ భవాని విగ్రహాల ధ్వంసం చేయడం జరిగిందని ఒక రెండు మూడు రోజుల నుంచి సోషల్ మీడియాలో చాలా వైరల్ గా మారింది ఆ విషయంపై మంచల్ మండలం సిఐతో మాట్లాడడం జరిగింది. సిఐ కూడా చాలా సానుకూలంగా మాట్లాడడం ఎటువంటి ఇబ్బంది లేదు అని చెప్పడం జరిగింది. అక్కడ ఉన్నటువంటి గిరిజన నాయకులతో కూడా మాట్లాడడం జరిగింది ఎటువంటి ఇబ్బంది లేదు. ఇబ్రహీంపట్నం స్థానిక ఎమ్మెల్యే గారికి కూడా గిరిజన స్థానిక నాయకులు కలవడం జరిగింది. ఎమ్మెల్యే కూడా మన గిరిజనులకు గుడి నిర్మాణానికి నిధులు అలాగే గవర్నమెంట్ భూమిలో భూమి కూడా ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది అని గిరిజన నాయకులు తెలిపారు. కావున స్థానిక ఎమ్మెల్యే కి , సిఐకి ప్రత్యేక ధన్యవాదాలు జై గోర్ బంజారా,జై సేవాలాల్, జై జగదంబ భవాని,గిరిజన యువనాయక ఆకాష్ నాయక్



# ఏకశిలలో ఘనంగా సైన్స్ ఫేర్ వేడుకలు








**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూరు ప్రతినిధి (పి.సైదులు), ఫిబ్రవరి28:** హనుమకొండ జిల్లా ఐనవోలు మండల పరిధిలోని ఖమ్మం హైవెలోని ఏకశిల సిబిఎస్ఇ,స్టేట్ స్కూల్స్ లో సైన్స్ ఫేర్ పోటీలు ఘనంగా నిర్వహించారని, విద్యార్థులు అద్భుతమైన శాస్త్రీయ ప్రతిభ కనబరిచి,పాఠశాల స్థాయి బహుమతులకు ఎంపికయ్యారని ఏకశిల విద్యా సంస్థల అధినేత డా.గౌరు తిరుపతి రెడ్డితెలిపారు.మిషన్ ఇన్నోవేషన్ ఆఫ్ ఏకశిల అనే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డా.గౌరు తిరుపతి రెడ్డి.విద్యార్థులు గైడ్ టీచర్స్ సహకారంతో తయారుచేసిన సుమారు407 ప్రాజెక్టులను పరిశీలించి, బహుమతులకు ఎంపికైన విజేతల్ని, ఉపాధ్యాయుల్ని అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ...జనాభా అతిగా పెరుగుతున్న దృష్ట్యా తదనుగుణంగా సైన్స్ ఆవిష్కరణలు జరిగినప్పుడు మాత్రమే మానవ జీవనం సాధ్యమన్నారు.అందువలన వ్యయ, ప్రయాసల కోర్చి, గణితం,సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రంలకి సంబంధించిన అటల్ టింకరింగ్ ల్యాబుల్ని ఏర్పాటుచేశామని,సైంటిఫిక్‌కోణంలో విద్యకొనసాగాలని ఇలాంటి సైన్స్ ఫేర్స్, శాస్త్రీయ అవగాహనా సదస్సులు నిర్వహిస్తూ, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తున్నామన్నారు.పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.డి. బాబా మాట్లాడుతూ.... భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ఆధునికప్రయోగశాలలు,నిష్ణాతులైన శిక్షకులను ఏర్పాటు చేసి, శాస్త్రీయ విధానాలని బోధింపచేస్తున్నామని, రేపటిభారతావనికి యువ సైంటిస్టులను అందించాలనే సుసంకల్పంతో మిషన్ ఇన్నోవేషన్ ఇన్ ఏకశిల అనే నినాదంతో ముందుకు వెల్తున్నామన్నారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ కె.రవి కిరణ్,మ్యాథ్స్,సైన్స్,సోషల్ గైడ్ టీచర్స్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# దాట్ల ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుకలు







**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూరు ప్రతినిధి(సాంబ), ఫిబ్రవరి28:** దంతాలపల్లి మండలం లోని దాట్ల ప్రాథమిక పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్కే ఆశ మాట్లాడుతూ... తార్కిక ఆలోచన పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు విద్యార్థులు పరిశోధన చేయుటకు ప్రేరణ కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు చింతల సురేష్ మాట్లాడుతూ...దాట్ల ప్రాథమిక పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలు 1928 ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్ ప్రభావాన్ని కనుగొన్నందుకు ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న సైన్స్ దినోత్సవం జరుపుకోవడం ఎంతో స్ఫూర్తిదాయకామని పిల్లలకు వివరించడం జరిగింది. ఇలాంటి సైన్స్ డే కార్యక్రమాలు పాఠశాలలో జరపడం అభినందనీయమని ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని అన్నారు. తన చుట్టూ ఉన్న పరిసరాలను విద్యార్థులు నిశితంగా పరిశీలిస్తారని,మూఢనమ్మకాలపై అవగాహన పొందుతారని విద్యార్థులు శాస్త్రీ ఆలోచన పెంపొందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సైన్స్ కు సంబంధించిన జీర్ణ వ్యవస్థ, శ్వాస వ్యవస్థ, జల చక్రం, జంతువుల జీవన విధానం, ఆహార పిరమిడ్ కార్బన్డయాక్సైడ్ వాయువును గుర్తించడం వంటి ప్రాజెక్ట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్,అనిత కుమారి,కవిత,అపర్ణ,విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసి పదవీ విరమణ పొందడం అదృష్టం

- పదవీ విరమణ పొందిన ఏఎస్సై సత్యనారాయణను సత్కరించిన ట్రాఫిక్ సిఐ పి.పాపయ్య

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),ఫిబ్రవరి28:** ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసి గౌరవ ప్రదంగా పదవీ విరమణ పొందడం అదృష్టమని ట్రాఫిక్ సిఐ పి.పాపయ్య అన్నారు.బేగంపేట్ ట్రాఫిక్ ఏఎస్సై గా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన బేగంపేట్ ట్రాఫిక్ ఏఎస్సై సత్యనారాయణ ను శుక్రవారం ట్రాఫిక్ సిఐ పి.పాపయ్య స్థానిక కార్యాలయంలో శాలువా కప్పి, మిఠాయి తినిపించి ఘనంగా సత్కరించారు. క్రమశిక్షణతో పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించిన ఏఎస్సై సత్యనారాయణ సేవలను సిఐ పాపయ్య ప్రత్యేకంగా అభినందించారు.ఈ సంద్భంగా సిఐ పాపయ్య మాట్లాడుతూ....పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం ఏఎస్సై సత్యనారాయణ తన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని తెలిపారు. భవిష్యత్తులో ఏ విధమైన సహాయం కావాలన్నా వెంటనే తమను సంప్రదించాలని వారికి తెలియజేశారు.ఈ కార్ర్యమంలో ఎస్సై ఆనంద్ కుమార్,ఎస్సై శివ రాజ్,బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# కృష్ణవేణి స్కూల్‌లో సైన్స్ ఫేర్ కార్యక్రమం

- ప్రత్యేక ప్రతిభ కనబర్చిన విద్యార్థులు
- ముఖ్య అతిథిగా పాఠశాలల డైరెక్టర్ ఏం.ఏ.సత్తార్



**తొలి అక్షరం/షాద్ నగర్:** రంగారెడ్డి జిల్లా,షాద్ నగర్ పట్టణంలో కృష్ణవేణి స్కూల్ లో యాజమాన్యం ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా ఆధ్వర్యంలో సైన్సు ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఏం. ఏ. సత్తార్ మరియు జోనల్ మేనేజర్ అబ్దుల్ వహీద్ పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ వల్ల పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన పెంచుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని,భావితరాల పిల్లలకు టెక్నికల్ గా సైన్స్ ఫెయిర్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. అంతేకాక తమకు తెలియని అనేక అంశాలను కూడ విద్యార్థులు తెలుకుంటారన్నారు. ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల సృజనాత్మక వెలికి తీసి వారిలో విజ్ఞానం పట్ల అవగాహన కల్పించి వారిలో నైపుణ్యాలను పెంపొందించడమే సైన్స్ ఫెయిర్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. సైన్స్ ఫెర్లో పండగలు, పొల్యూషన్,ఆహారపదార్థాలు, ట్రాఫిక్ నిబంధనలు, యాసిడ్ రైన్ సోలార్ సిస్టమ్ ఇతర అంశాల గురించి విద్యార్థులు విశ్లేషించారు. విద్యార్థులు వారి తల్లదండ్రులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



# పెద్దవంగర నుండి వడ్డే కొతపెల్లి రోడ్డు మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**● కాంట్రాక్టరుతో ఫోన్లో మాట్లాడిన మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్ నెమరుగొమ్ముల ప్రవీణ్ రావు**



**తొలి అక్షరం/పెద్దవంగర ఫిబ్రవరి 28:** పెద్దవంగర ఎక్స్ రోడ్డు నుండి వడ్డెకొత్తపల్లి సెంటర్ వరకు మరియు పోచారం గ్రామాలకు మెటల్ రోడ్డు వేసి పనులను మధ్యలో నిలిపి వేయడం ద్వారా వివిధ అవసరాలకు మండల కేంద్రానికి వెళ్లవలసిన వాహనదారులు బైక్ యాక్సిడెంట్ కాగా గ్రామాలలో ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అని ఇట్టి విషయంపై సంబంధిత రోడ్డు కాంట్రాక్టర్ కు ఫోన్ ద్వారా సంబాశించి వాహనదారులు పడుతున్న ఇబ్బందులను క్షుణ్ణంగా వివరించడం జరిగింది. ఈవిషయంపై కాంట్రాక్టర్ సానుకూలంగా స్పందిస్తూ రోడ్డు పనులకు సంబంధించిన యంత్రాలను పని ప్రదేశానికి పంపించామని సాధ్యమైనంత తొందరగానే వారం రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేస్తామని వారికి హామీ ఇవ్వడం జరిగింది.అని పత్రిక వేలేకరులకు తెలియచేసారా

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం





**తొలి అక్షరం/దంతాలపల్లి ఫిబ్రవరి 28:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దంతాలపల్లి లో ప్రధానోపాధ్యాయులు శ్రీ పల్లా వేణుమాధవ్ రెడ్డి అధ్యక్షతన జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా భారత రత్న, నోబెల్ అవార్డు గ్రహీత సి వి రామన్ కు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో క్విజ్ ,వ్యాసరచన ,ఉపన్యాస, సైన్స్ ఎగ్జిబిట్స్ ప్రదర్శన , రంగోలి మొదలగు కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. హెచ్ ఎం వేణు మాధవ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకొని భవిష్యత్తులో సైంటిస్టులుగా రాణించి దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. వివిధ పోటీలలో పాల్గొని గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమములో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయురాలు శ్రీమతి శ్రీదేవి , స్టాఫ్ సెక్రటరీ శ్రీ సురేందర్ గుప్త, సైన్స్ ఉపాధ్యాయులు మంజుల, రమేష్ ,అస్గర్ అలీ ,సాదిక ఆలీ, కవిత, వేణుగోపాల్, రజనీ దేవి, రవి మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యూ మాంటిసోరి పాఠశాలలో ఘనంగా సైన్స్ డే వేడుకలు




**తొలిఅక్షరం/ఫిబ్రవరి,28 (నర్సంపేట):** నర్సంపేట పట్టణంలోని స్థానిక న్యూ మాంటిసోరి పాఠశాలలో సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా విద్యార్థులు పలు సైన్స్ ప్రాజెక్ట్ ల నూతన ప్రదర్శనల తో అందరినీ ఆకట్టుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలోని తల్లిదండ్రులు ముఖ్య అతిథులు విద్యార్థులచే ప్రదర్శించబడిన పలు సైన్స్ ఎగ్జిబిటలను ఆసక్తిగా తిలకించారు అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మోహన్ రావు మాట్లాడుతూ... విద్యార్థిని విద్యార్థులచే ప్రదర్శించబడినటువంటి నూతన ఆవిష్కరణలు కొత్తగా ఉన్నాయని అందుకు సహకరించిన ఉపాధ్యాయుల సహకారం ఎంతో గొప్పదని, విద్యార్థి దశ నుంచి సైన్స్ పై మక్కువ పెంచుకుంటే భవిష్యత్తులో అద్భుతాలను సృష్టించవచ్చు అని తెలియజేశారు ఆ విధంగా ఉపాధ్యాయులు పాఠాలను చెప్పేటప్పుడు ప్రత్యేక ఎగ్జిబిట్ల ద్వారా వివరిస్తే బాగుంటుందని ఉపాధ్యాయులకు సూచించడం జరిగింది అనంతరం ఎంపికైన సైన్స్ ప్రాజెక్ట్ ల విద్యార్థులకు బహుమతులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరస్పాండెంట్ ఎర్ర జగన్మోహన్ రెడ్డి డైరెక్టర్ ఎర్ర ఊర్మిళ పాఠశాల ప్రధాన అధ్యాపకులు కుంభం రాజా పాపిరెడ్డి ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

# నూతన శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలో యువత గ్లోబల్లీడర్‌గా ఎదగాలి

**- డఫ్ఫోడిల్స్ విద్యసంస్థల చైర్మన్ చింతల నరేందర్**



**తొలి అక్షరం/ఫిబ్రవరి 28(నర్సంపేట):** నూతన శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలో యువత విద్యార్థులు గ్లోబల్ లీడర్గా ఎదగాలని డఫ్ఫోడిల్స్ విద్యసంస్థల చైర్మన్ చింతల నరేందర్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని డఫ్ఫోడిల్స్ హై స్కూల్ లో జాతీయ సైన్స్ డే పురస్కరించుకొని పాఠశాలలో ఏర్పాటుచేసిన సైన్స్ ఫెయిర్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నూతన పరిజ్ఞానంతో కొత్త విషయాలను ఆవిష్కరించాలన్నారు.విద్యార్థులు సైన్స్ పట్ల మరింత ఆసక్తిని పెంచుకోవాలని అన్నారు.అనంతరం పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ఎగ్జిబిట్లను తిలకించారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జుబేదా ఖాన్,ఉపాధ్యాయ ఉపాధ్యాయునీలువిద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం, అంతర్జాతీయ దర్జీల దినోత్సవం





**తొలి అక్షరం/దంతాలపల్లి ఫిబ్రవరి 28:** మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దాట్ల లో ప్రధానోపాధ్యాయులు కొమ్మవరపు కృష్ణయ్య అధ్యక్షతన జాతీయ విజ్ఞాన దినోత్సవం మరియు అంతర్జాతీయ ధర్జీల దినోత్సవం భారత రత్న, నోబెల్ అవార్డు గ్రహీత సి వి రామన్ కు పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. హెచ్ ఎం కృష్ణయ్య మాట్లాడుతూ ఉదయం పూట పిల్లలు ఈ రోజు ముగ్గులతో సైన్స్ సంబంధిత చిత్రాలను వేసి వారి ప్రతిభను చాటరాని, విద్యార్థులు సైన్స్ సంబంధిత వివిధ ప్రయోగాల ప్రదర్శన చేసి అబ్బుర పరచారని, భవిష్యత్తులో పిల్లలు సైంటిస్టులుగా ఎదిగి ప్రపంచ పటంలో సి. వి రామన్ లాగా వెలుగొందాలని, అదే విధంగా ఈ రోజు అంతర్జాతీయ ధర్జీల దినోత్సవం పురస్కరించుకొని మాట్లాడుతూ ఈ రోజుల్లో రెడిమెడ్ దుస్తులు మార్కెట్ లోకి రావడం వల్ల ధర్జీల జీవితం అగమ్యగోచరంగా మారిందని, దర్జీలు మనకు దుస్తులు అందించి నాగరికులను చేసిందని వివరించారు. ఈ సందర్భంగా క్విజ్, వైజ్ఞానిక సంబంధించిన చిత్రపటాలు రంగులతో వేసి, వైజ్ఞానిక ప్రదర్శన లో ప్రతిభ కనపరిచిన,వ్యాసరచన, ఉపన్యాసపోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చి అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు విజయ్ కుమార్, స్వప్న, రమేష్, సునీత, ప్రేమ్ కుమార్, రామయ్య, సాయికుమార్, రోషిణి, యాక స్వామి, మాధవి, రిషిత తదితరులు పాల్గొని విజయవంతం చేసారు.

# నూతన శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలో యువత గ్లోబల్ లీడర్ గా ఎదగాలి

**● జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కే శ్రీనివాస్**




**తొలి అక్షరం/చెన్నారావుపేట ఫిబ్రవరి 28:** చెన్నారావుపేట నూతన శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలో యువత విద్యార్థులు గ్లోబల్ లీడర్గా ఎదగాలని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కే శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సిద్ధార్థ హై స్కూల్ లో అంతర్జాతీయ సైన్స్ డే పురస్కరించుకొని పాఠశాలలో ఏర్పాటుచేసిన సైన్స్ ఫెయిర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నూతన పరిజ్ఞానంతో కొత్త విషయాలను ఆవిష్కరించాలన్నారు. విద్యార్థులు సైన్స్ పట్ల మరింత ఆసక్తిని పెంచుకోవాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ఎగ్జిబిట్లను తిలకించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. మండల స్పెషల్ అధికారి బాలకృష్ణ, ఎంపీడీవో శ్రీ వాణి, ఎస్సై రాజేష్ రెడ్డి. ట్రస్మా డివిజన్ అధ్యక్షులు పాశికంటి రమేష్. జిల్లా ఉపాధ్యక్షులు జాంగిర్. మాజీ జెడ్పిటిసి జున్నుతుల రాంరెడ్డి. ప్రిన్సిపాల్ అండెం కరుణాకర్ రెడ్డి. ఏఎస్ఐ లక్ష్మణమూర్తి, ఉపాధ్యాయ ఉపాధ్యాయునీలు. విద్యార్థులు పాల్గొన్నారు.

# సండ్ర ఉపేందర్ కుటుంబానికి ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ 10 లక్షల రూ. లు చెక్కు అందించిన జేఓటిసి మిత్రులు

**తొలి అక్షరం/బయ్యారం ఫిబ్రవరి28:** మహబూబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో సండ్ర ఉపేందర్ 40 సం,,, గవర్నమెంట్ టీచర్ ఉద్యోగం వచ్చి నెల రోజులు తరువాత స్కూల్ కి వెళ్తుండగా ప్రమాదవాషత్తు ఆక్సిడెంట్ అయి మరణించటం జరిగింది,తనకు ఇద్దరు పిల్లలు వున్నారు, ఉపేందర్ sbi లైఫ్ లో 25,000 తో స్మార్ట్ స్కాలర్ పాలసీ తీసుకోవటం జరిగింది, తన మరణానికి డెత్ క్లెయిమ్ కింద 10 లక్ష ల బీమా sbi లైఫ్ చెల్లించటం జరిగింది, నామినీ సండ్ర స్వప్న , sbi లైఫ్ వారు కేవలం 30 రోజులలో డెత్ క్లెయిమ్ అందించి నందుకీ కృతజ్ఞతలు తెలిపారు, sbi లైఫ్ బిజినెస్ మేనేజర్ బండి నరేష్ మాట్లాడుతూ ఎస్బిఐ లైఫ్ స్మార్ట్ స్కాలర్ పాలసీ కేవలం 25,000 హాఫ్ ఇయర్ మోడ్ ఎంచుకుని పాలసీ ప్రారంభించిన ఉపేందరూ ఆక్సిడెంట్ లో మరణించగా 10 లక్ష లు ఆక్సిడెంట్ బీమ అందించటం తో పాటు మిగిలిన 5 సం,, పూర్తి ప్రీమియం లు ఎస్బిఐ లైఫ్ చెలించి చివరికి చైల్డ్ కి 18 సం పూర్తి అయ్యాక పూర్తి మెచూరిటీ చైల్డ్ కి అందిస్తారని తెలిపారు , ప్రతి కుటుంబం ఇన్సూరెన్స్ పాలసీ తీసుకొని తమ కుటుంబానికి భీమా మరియు ఆర్థిక భరోసా అందిచలని కోరారు, సీనియర్ లైఫ్ మిత్ర భూక్యా కుమార్ మాట్లాడుతు అతి తక్కువ ప్రీమియం తో ఇన్సూరెన్స్ ఇచ్చే పాలసీ లు అందుబాటులో వున్నాయ్ అని తెలిపారు,ప్రతి కుటుంబానికి బీమా భరోసా ఇవటానికి నిత్యం అందుబాటులో వుంటాను అని,కష్టాల్లో వున్నా కుటుంబానికి ఆర్థిక రక్షణ ఇవ్వటం సంతృప్తి ని ఇచ్చిందని తెలిపారు,ఈ కార్యక్రమం లో లైఫ్ మిత్ర JOTC లైఫ్ మిత్రలు జెట్టి యాకయ్య, మంద కార్తీక్, నరాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.








# లేబర్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితముగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించబడును

**- సీఎస్‌సీ హెల్త్ కేర్ డివిజన్ మేనేజర్ వద్ధి హరీష్**

**తొలిఅక్షరం/ఫిబ్రవరి 28, (నర్సంపేట):** నర్సంపేట పట్టణ మరియు పరిసర గ్రామాల ప్రజలకు తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ శాఖ (లేబర్ డిపార్ట్మెంట్) వారి నేతృత్వంలో సి.ఎస్. సి హెల్త్ కేర్ అండ్ వెల్నెస్ సర్వీసెస్ వారు నర్సంపేట స్థానిక బొంద బడి,మోడల్ స్కూల్ మల్లపల్లి క్రాస్ రోడ్ నందు ఆదివారం 02' మార్చి 2025రోజున ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు సీ ఎస్ సీ హెల్త్ కేర్ డివిజన్ మేనేజర్ వద్ధి హరీష్ తెలిపారు,అనంతరంఆయనమాట్లాడుతు.. పట్టణం/గ్రామాలలో లేబర్ కార్డు కలిగిఉన్నప్రతిఒక్కరికీబీపీ, షుగర్,థైరాయిడ్,లివర్, కిడ్నీ,కాల్షియమ్, యురిక్యాసిడ్ (కీళ్లనొప్పులు),రక్త ముత్ర పరీక్షలు,అన్ని రకాల వైరస్ టెస్ట్ మొదలగు 130 రకాల వైద్య ఆరోగ్య పరీక్షలు ఉచితముగా నిర్వహించి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ ఉండే హెల్త్ స్క్రీనింగ్ కార్డు అందచేయబడును అని వారు తెలిపారు.ఈ కార్యక్రమం ఆదివారం 02మార్చి,ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నర్సంపేట పట్టణం లోని బొంద బడి ఆవరణంలో నిర్వచించడం జరుగుతోంది, కావున లేబర్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు మీ ఆధార్ కార్డు,లేబర్ కార్డు తీసుకువచ్చేఆఅవకాశాన్నిసద్వినియోగం చేసుకోగలరు అని అన్నారు. ఒక వేల మీకు లేబర్ కార్డు ఉండి సమయానికి అందుబాటులో లేకపోతే ఆధార్ కార్డు ద్వారా కూడా ఈ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవచ్చు అని తెలిపారు.

# యూసుఫ్ పేట ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం



**తొలి అక్షరం/పాపన్నపేట:ఫిబ్రవరి 28:** మండల పరిధిలోని యూసుఫ్ పేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ గా కోమలంచ శ్రీజ,ఆర్జేడీ గా అక్షిత్,జాయింట్ కలెక్టర్ గా సాత్విక్,డీఈవోగా శ్రీవర్ష,ఎంఈవోగా ఎల్లంపల్లి అర్చన,హెడ్మాస్టర్లుగా అఖిల,శివశంకర్, ఉపాధ్యాయులుగా శ్రీతేజ,స్వాతి, హరిచందన,రిజ్వాన్,వరుణ్ లు వ్యవరించగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాలతి దేవి బహుమతులు అందజేయగా ఉపాధ్యాయ సిబ్బంది పద్మ,శ్రీనివాస్, నర్సింలు,కనకయ్య,హీరాలాల్,పవన్, రఫీక్,శ్రవణ్,రాజేందర్ వీరేశం లు పర్యవేక్షించారు.

# యువత వ్యాపార రంగాలలో రాణించాలి

**- మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు**

**తొలి అక్షరం/మరిపెడ ఫిబ్రవరి 28:** మహబూబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రం పురపాలక సంఘ పరిధిలోని భానోత్ శాంతి మన్సూర్ దంపతులు నూతనంగా ఏర్పాటు చేసిన శాంతి ఐరన్ హార్డ్వేర్ షాపుకు ముఖ్యఅతిథిగా హాజరైనా మహబూబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా వ్యాపార రంగంలో రాణించి మంచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు యువతకు స్వయం ఉపాధి కల్పించుకుని పనిచేసే సామర్థ్యం ఉండాలి అన్నారు గవర్నమెంట్ జాబ్ ఒక్కటే మార్గం కాదు యువత ప్రైవేట్ రంగంలో పనిని క్రియేట్ చేసుకుని ముందుకు కొనసాగాలి అని కోరారు ఈ కార్యక్రమంలో తోటి మేస్త్రిరులు ఉపేందర్ వెంకన్న రవి బిఆర్ఎస్ నాయకులు కాలు నాయక్ పాల్గొన్నారు



# గుండెపుడి గ్రామంలో అంగరంగ వైభవంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ

**● విగ్రహ దాత భూ రక్ష ఫౌండేషన్ చైర్మన్ బయ్యా సోమన్న గౌడ్**

**తొలి అక్షరం/మరిపెడ ఫిబ్రవరి 28:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక సమానత్వం కోసం పోరాడిన మహానాయకుడు స్వాతంత్ర్య సమరయోధుడు అన్ని కులాల హక్కుల కోసం పోరాటం చేసిన మహనీయుడు సర్దార్ పాపన్న గౌడ్ స్వాతంత్ర్య సమరంలో ప్రత్యేకమైన స్థానం సంపాదించిన గొప్ప యోధుడు. ఆయన కేవలం గౌడ్ కులానికే కాకుండా అన్ని కులాల ప్రజల హక్కుల కోసం పోరాడారు. బహుజనుల శ్రేయస్సు, సామాజిక సమానత్వం, మరియు ఆర్థిక స్వావలంబన కోసం ఆయన చేసిన కృషి అనితరసాధ్యం.**అసలు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఎవరు ఆయన బహుజనుల కోసం ఏం చేశాడు** 17వ శతాబ్దంలో కుల వివక్ష, నైజాం మరియు మొగల్ పాలనలో వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేసి కరీంనగర్, వరంగల్, నల్గొండ, మహబూబ్నగర్ ప్రాంతాలలో ప్రజల కోసం స్వతంత్ర పాలన నెలకొల్పే ప్రయత్నం చేసిన వీరుడు అన్ని కులాల ప్రజలను ఏకం చేసి, అన్యాయ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు భారతీయుల హక్కుల కోసం ఆయుధాలను ఎత్తి పోరాడిన ధీరుడు స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడిన మహా నాయకుడూ సర్దార్ సర్వాయి పాపన్నను గౌరవించడం మన బాధ్యత సామాజిక సమానత్వం కోసం పనిచేయాలి అన్ని కులాలను సమానంగా చూడాలి అనే లక్ష్యంతో పని చేశారు పాపన్న గౌడ్ వారసత్వాన్ని కొత్త తరాలకు తెలియజేయాలి విద్య, వ్యవసాయం, స్వయం ఉపాధిలో అభివృద్ధికి



కృషి చేయాలి అని పోరాడారు సర్దార్ పాపన్న గౌడ్ అణగారిన వర్గాల ప్రజలకు వెలుగునీడగా నిలిచిన ధీరుడు"సమాజ మార్పు కోసం మనం కూడా ముందుకు రావాలి అంటూ ప్రజల్లో విప్లవం తీసుకొచ్చిన మహాయోధుడు **విగ్రహ దాత భూ రక్ష ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ బయ్య సోమన్న గౌడ్** ఈరోజు గుండెపుడి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణ అంగరంగ వైభవంగా జరిగింది అంటే దానికి ముఖ్య కారణం భూ రక్ష ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ భయ్యా సోమన్న ఆయన గ్రామం నుంచి వెళ్లి వ్యాపారాల రిత్యా ఖమ్మంలో స్థిరపడ్డారు ఆయనను గుండెపుడి గ్రామ యువకులు సుమారు 40 మంది దాకా వెళ్లి సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఇప్పించాలి అని కోరారు వెంటనే ఆయన పెద్ద మనసుతో ముందుకు వచ్చి ఇలాంటి మంచి పనులు చేయడానికి నేను ఎల్లప్పుడూ ముందుంటాను అంటూ వారికి ధైర్యం చెప్పి సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి అయ్యే ఖర్చు ఎంతైనా నేను ఇస్తాను అని మాట ఇచ్చి అన్న ప్రకారమే విగ్రహాన్ని



తన సొంత ఖర్చులతో తెప్పించి ఈరోజు గుండెపూడి గ్రామంలో అంగరంగ వైభవంగా విగ్రహ ఆవిష్కరణ చేయడానికి కీలక పాత్ర పోషించారు ముఖ్యంగా యువకులు సర్దార్ సర్వాయి పాపన్న కమిటీ సభ్యులు యూత్ పిల్లలు రేఖ ప్రవీణ్ సోమ గాని గణేష్ బోడపట్ల పండు రేక నరేష్ భయ్య గణేష్ ఇంకా కొంతమంది కమిటీ సభ్యులు ముందుండి గద్దె స్టార్ట్ అయినప్పటి నుంచి ఇప్పటివరకు పూర్తిగా బాధ్యత వహించి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసినందుకు వారికి గ్రామ గౌడ సంఘ సభ్యులు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నాయకులు మరియు విగ్రహ దాత బయ్య సోమన్న గౌడ కుల అధ్యక్షులు రేఖ శ్రీనివాస్ పెద్ద గౌడ్ బోడపట్ల రవి గౌరవాధ్యక్షుడు బోడపట్ల సుధాకర్ ప్రధాన కార్యదర్శి రేఖ ఉప్పలయ్య ఉపాధ్యక్షుడు బోడపట్ల శ్రీనివాస్ సారకొల్ల గౌడ్ రేఖ వెంకన్న సోమ గాని శ్రీనివాస్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు రేఖ ప్రవీణ్ కుమార్ రేఖ నరేష్ సోమగాని గణేష్ రేఖ ఉప్పలయ్య బయ్య గణేష్ రేఖ లింగస్వామి పులుసు మల్లేష్ బోడపట్ల లింగన్న గుండగాని పుల్లయ్య గుండగాని రంగనాథ్ లింగాల వెంకన్న పులుసు మహేష్ బోడపట్ల అశోక్ గుండగాని వీరన్న రేఖ వెంకన్న బుడిగి మల్సూర్ బయ్య పిచ్చయ్య రేఖ సురేష్ గౌడ కుల సభ్యులు యువకులు గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు

# వెనకాల నిలబడే వ్యవస్థ బంద్ కావాల

**● స్థానిక ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీల సత్తా చాటాలి..**

**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి28:** రంగారెడ్డి జిల్లా,షాద్ నగర్ నియోజక వర్గంలో బీసీ సేన కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో బీసీ సేన రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల ప్రశాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో జనరల్ కోటాలో బీసీ ల సత్తా చాటాలి.అని వెనకాల నిలబడే వ్యవస్థ మారాలని వారు అన్నారు అదే విధంగా బీసీ వర్గాలు భారత దేశ అభివృద్ధికి కీలక భూమిక పోషిస్తున్నాయి. వ్యవసాయం,వాణిజ్యం, సేవ రంగం, వ్యాపారం, ఉద్యోగాలు ఇలా అన్ని రంగాల్లో తమ అంకితభావంతో ఎదుగుతూ దేశానికి సహకారం అందిస్తున్నాయి. కానీ, రాజకీయంగా బీసీల ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం తీవ్రమైన అసమతుల్యత. ఈ అసమతుల్యతను తొలగించేందుకు ఈ స్థానిక ఎన్నికలు మనకు గొప్ప అవకాశం!ఎందుకు బీసీల పాలన అవసరం సమాజానికి న్యాయం చేయగల నాయకత్వం రావాలి ప్రజా సమస్యలపై పని చేసే నాయకులు అధికారం పొందాలి బీసీల సంక్షేమం కోసం పోరాడే హక్కుగా మారాలి రాజకీయంగా బలమైన స్థానాన్ని నిర్మించుకోవాలని వారు అన్నారు ఈ ఎన్నికల్లో బీసీల



భాగస్వామ్యం పెరగాలి. మన బలాన్ని గుర్తించి, బీసీ వర్గాల అభ్యర్థులను గెలిపించాలి. ఒకరి ఓటు మరొకరి భవిష్యత్తును నిర్ణయిస్తుంది! కాబట్టి, మన సామూహిక శక్తిని అర్థం చేసుకుని, ఈ ఎన్నికల్లో బీసీల విజయాన్ని ఖాయం చేయాలి.బీసీలు ఎవరికి ఓటు వేయాలి?బీసీల అభివృద్ధిని ప్రోత్సహించే వారికి, బీసీ వర్గాలకు అన్యాయం చేయని వారికి, బీసీల హక్కులను కాపాడే వారికి మాత్రమే ఓటు వేసే సమయం ఇది. రాజకీయ పార్టీల వాగ్దానాలకు మోసపోకుండా, వాస్తవానికి దగ్గరగా ఉండే నాయకులను ఎంచుకోవాలి.ఈసారి మనం వెనుకబడి ఉండకూడదు! పార్టీలు మనల్ని ఓటు బ్యాంక్‌గా చూసే రోజులు పోయాయి. పాలనలో మనకు రావాల్సిన స్థానం, హక్కు, గౌరవం సాధించుకోవాలి. బీసీల నాయకత్వాన్ని బలంగా నిలబెట్టి, అధికారం మన చేతుల్లోకి తీసుకురావడమే ఈ ఎన్నికల అసలు లక్ష్యం."బీసీల పరిపాలన %-% సమాజ అభివృద్ధి" అనే నినాదంతో ముందుకు సాగుదాం. మనం ఒక్కటిగా ఉన్నప్పుడే బలమైన శక్తిగా మారగలం. స్థానిక స్థాయిలో బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించి, గెలిపించి, అధికారంలోకి తెచ్చే బాధ్యత మనదే! మన హక్కుల కోసం మనమే పోరాడాలి %-% మన భవిష్యత్తును మనమే నిర్మించాలి! ఈ ఎన్నికలు బీసీ వర్గాల భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయి. కాబట్టి, ప్రతి ఓటు బీసీ అభివృద్ధికి దోహదపడేలా ఉండాలి. మన బలాన్ని, మన ఐక్యతను నిరూపిద్దాం! ఈ కార్య క్రమంలో బీసీ సేన అసెంబ్లీ అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి భూష%శీ% నరేష్ అసెంబ్లీ కోశాధికారి చందూలాల్ జమాల్పూర్ గారు అసెంబ్లీ యువజన ఉపాధ్యక్షులు శివ ముదిరాజ్ షాద్నగర్ టౌన్ అధ్యక్షులు బీసీ సేన తంగేడుపల్లి శంకర్ ప్రధాన కార్యదర్శి షాద్నగర్ బిసి సేన ప్రధాన కార్యదర్శి మల్కాపురం రవి ఉపాధ్యక్షులు వరప్రసాద్ భాగ్యనగర్ కాలనీ అధ్యక్షులు సురేందర్ గౌడ్ ఉపాధ్యక్షులు సాయిలు, ఫరూక్నగర్ మండల్ అధ్యక్షుడు మేకల వెంకటేష్ ఉపాధ్యక్షులు మార్గం భద్రప్ప 11వ వార్డు అధ్యక్షులు మడంపల్లి శివకుమార్ అధ్యక్షులు ఇష్కం గారి హరికుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.





## యూనిక్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో సైన్స్ ఫెయిర్..

**- ముఖ్య అతిథులుగా డా ఆనంద్ కుమార్,భార్గవి ఏబీవి హిస్పిటల్, సుధాకర్ రెడ్డి, భువశంకర్**

**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి28:** రంగారెడ్డి జిల్లా,షాద్ నగర్ పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవము సందర్భంగా శుక్రవారం నాడు యూనిక్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో యాజమాన్యం ప్రిన్సిపల్ నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డా.ఆనంద్ కుమార్,భార్గవి ఏబీవి హిస్పిటల్, సుధాకర్ రెడ్డి, భువశంకార్ హాజరయ్యారు. సైన్స్ ఫెయిర్ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన పెంచుకునేందుకు ఎంతగానో సైన్స్ ఫెయిర్ ఉపయోగపడుతుంది. సైన్స్ కు సంబంధించిన ఎన్నో ఎక్స్పరిమెంట్లు చూపిస్తూ ఎలక్ట్రానిక్ పరికరాలు మొదలైనవి ఎంతో ఆకర్షణీయంగా నిలిచాయి. సైన్స్ పట్ల అవగాహన పెంచుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని భావితరాల పిల్లలకు టెక్నికల్ సైన్స్ ఫెయిర్ ఎంతగానో దోహదపడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనిక్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రిన్సిపల్ నరేంద్ర కుమార్, స్కూల్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం


**- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**



**తొలి అక్షరం/నందిగామ,ఫిబ్రవరి28:** రంగారెడ్డి జిల్లా,షాద్ నగర్ నియోజకవర్గంలోని,నందిగామ మండలం,ఈదులపల్లి గ్రామంలో శ్రీ వీరభద్ర నాగలింగేశ్వర స్వామి దేవాలయంలో శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ ఈదులపల్లి గ్రామంలో ప్రతి సంవత్సరం శివపార్వతుల కళ్యాణం జరపడం జరుగుతుందని ఈ కళ్యాణ మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాలలోని ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కళ్యాణ మహోత్సవంలో పాల్గొని దేవుని కృపకు పాత్రులవుతారని తెలిపారు.మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, దేవేందర్ యాదవ్, టిఆర్ఎస్ నాయకులు భక్తులు పాల్గొన్నారు.

## మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ

**తొలి అక్షరం/మంథని:** నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అంకరి కుమార్ తెలిపారు. మార్చి 1న శనివారం మంథని సీయోను చర్చిలో అమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఐదు రకాల శిక్షణ కార్యక్రమాలు ఇవ్వడం జరుగుతుందని,సర్ఫ్ తయారు చేయడం, ఫినాయిల్, వాజ్లిన్, జండుబాం, సోప్ ఆయిల్ లాంటి ఐదు రకాల వస్తువులు తయారు చేయడం నేర్పించి వాటికి సంబంధించిన రా మెటీరియల్ ఎక్కడ దొరుకుతుంది లాంటి పూర్తి సమాచారం ఇవ్వడం జరుగుతుందని ఆసక్తి కలిగిన నిరుద్యోగ మహిళలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ, వివరాలకు 9440449386 సంప్రదించాలని అయన కోరారు..



# విద్యార్థులను పరామర్శించిన బీసీ సేన నాయకులు..

**● ఒకే ఆటోలో 15 మంది ఎట్లా కూర్చుంటారు.**

**● అసలు ఆర్టీఓ విద్యా అధికారులు ఏం చేస్తున్నట్టు.**

**● బీసీసేన రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల ప్రశాంత్ ముదిరాజ్..**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి28:** రంగారెడ్డి జిల్లా,షాద్ నగర్ పట్టణంలోని శ్రీ సత్య సాయి ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ఆటో ప్రమాదానికి గురై గాయపడ్డారు. నందిగామ మండలంలోని వీర్లపల్లి, చర్ల అంతిరెడ్డి గూడా, అప్పారెడ్డి గూడ గ్రామాలకు చెందిన 15 మంది విద్యార్థులు ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు ఆటోలో ప్రయాణిస్తుండగా, రెడ్ రోజ్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎదురుగా వచ్చిన బైక్ కారణంగా ఆటో బోల్తా పడింది.ఈ ఘటనలో డ్రైవర్ పిచ్చకుంట్ల పాండు తీవ్రంగా గాయపడగా, కొంతమంది విద్యార్థులకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన విద్యార్థులను తక్షణమే ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు.ఈ విషయం తెలిసిన వెంటనే బీసీ సేన నాయకులు ఆసుపత్రికి చేరుకుని గాయపడిన విద్యార్థులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి, వారికి మెరుగైన చికిత్స అందించాల్సిందిగా సూచించారు ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఈ ఘటనపై బీసీ సేన రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ ఒకే ఆటోలో 15 మంది ఎట్లా కూర్చున్నారని వారు అన్నారు అసలు ఆర్టీఓ విద్యా అధికారులు ఏం చేస్తున్నారు అని వారు ప్రశ్నించారు. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులతో చర్చించనున్నాము. విద్యార్థుల భద్రత మా ప్రాధాన్యత వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీసేన అసెంబ్లీ అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప, అసెంబ్లీ బీసీసేన ప్రధాన కార్యదర్శి భూష%శీ% నరేష్, అసెంబ్లీ బీసీసేన ట్రెజరర్ చందులాల్, షాద్ నగర్ టౌన్ అధ్యక్షులు తంగిడిపల్లి శంకర్,టౌన్ బీసీ సేన ప్రధాన కార్యదర్శి రవి, మల్కాపూర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# జాతీయ విజ్ఞాన దినోత్సవం: విశ్వవిఖ్యాత శాస్త్రవేత్త సి వి రామన్

**తొలిఅక్షరం/పర్వతగిరి ఫిబ్రవరి 28:** వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల అండ్ కళాశాల లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే సైన్స్ ఎగ్జిబిషన్ ని ప్రారంభించిన ప్రిన్సిపల్ పి. అపర్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గురుకులాలకు అందిస్తున్న స్వచ్ఛమైన రుచికరమైన భోజనం చక్కటి ఆహ్లదకరమైన వాతావరణంలో విద్యార్థులు విద్య పట్ల ఆసక్తి చూపుతున్నారు ప్రైవేట్ అండ్ కార్పొరేటు స్థాయిలో పోటీపడి విద్యను అందిస్తున్న ఈ విద్యాసంస్థలలో విద్యార్థులు ఉన్నంత శిఖరాలకు చేరేలా మా ఉపాధ్యాయుని ఉపాధ్యాయ బృందం చే అనునిత్యం పిల్లలకు విద్య అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామన్నారు. సైన్స్ డే సందర్భంగా విద్యార్థుల్లో సైన్స్ ఎగ్జిబిషన్ తయారు చేసిన వారిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఆరుగురికి ప్రిన్సిపల్ ప్రైజ్ మనీ అందజేశారు, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ వేల్పుల కుమారస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వసతి సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నంత విద్యను అభ్యసించాలని తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని, విద్యార్థుల కు సూచించారు. సైన్స్ డే సందర్భంగా విద్యార్థులకు సొంత ఖర్చులతో ప్రథమ ప్రతిభ చూపిన ఆరుగురు విద్యార్థులకి ఆరు పెన్ పౌచులు, ఎగ్జిబిషన్ లో పాల్గొన్న విద్యార్థులకు 90 పెన్నులు అందించడం జరిగింది. వైస్ ప్రిన్సిపల్ జోష్ణ. వైస్ ప్రిన్సిపల్ స్వాతి. ఉపాధ్యాయుని ఉపాధ్యాయ బృందం పేరెంట్స్ కమిటీ సభ్యులు మహంకాళి యాదగిరి కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



# ఎల్లికట్ట అంబా భవాని మాత అమ్మవారికి భారీ వెండి కానుక

- మూడు లక్షల విలువగల మూడు కేజీల వెండితో భారీ దార పాత్ర బహుకరణ
- బహుకరించినవారు షాద్ నగర్ పట్టణానికి చెందిన కక్కునూరి లక్ష్మీ వెంకటేశం గుప్తా
- ఎల్లికట్ట అంబా భవాని మాత కమిటీ సభ్యులకు అందజేసిన కక్కునూరి కుటుంబం
- అమ్మవారి కరుణాకటాక్షాలు మా కుటుంబం పై ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నాను- వెంకటేశం గుప్తా






**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి28:** కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారం ఎలికట్ట శ్రీ అంబా భవానీ మాత దేవాలయానికి మూడు లక్షల విలువచేసే దాదాపు మూడు కిలోల భారీ దార పాత్రను బహుకరించారు షాద్ నగర్ పట్టణానికి చెందిన వ్యాపారి కక్కునూరి లక్ష్మీ వెంకటేశం గుప్త ఈ భారీ ధారపాత్రను ఎలికట్ట అంబ భవాని మాత ఆలయ చైర్మన్ ముత్యాల రాజు సమక్షంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ అమ్మవారి కరుణాకటాక్షాలు మా కుటుంబం పై ఎల్లవేళలా ఇలాగే ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడం మా కుటుంబం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన భవాని మాత ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఎంతో విశిష్టత కలిగిన అమ్మవారు మనసులో ఏ కోరికలు కోరుకున్న తప్పకుండా నెరవేరుతాయని అన్నారు. కక్కునూరి శ్రవణ్,సందీప్, శ్వేత, శ్రావణి, హారిక, మను శ్రీ, సంపూర్ణ,మ్యాడం నరేష్, సురేష్, మల్లేష్ మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


# రమణీయంగా రథోత్సవం పులకరించిన భక్తులు

- మారుమ్రోగిన దుర్గమ్మ నామస్మరణ
- మూడవ రోజు అదే జోరు.. దుర్గమ్మ సేవలో భక్తగణం









**తొలి అక్షరం/పాపన్నపేట, ఫిబ్రవరి 28:** జగజ్జనని ఏడుపాయల వనదుర్గామాత ఆలయం దుర్గమ్మ నామస్మరణతో మారుమ్రోగింది. మూడవ రోజు శుక్రవారం కన్నులు మిరుమిట్లు గొలిపే విధంగా రథోత్సవం జరిగింది. ఏడుపాయల దండకారణ్యం దుర్గమ్మ నామస్మరణతో మారుమ్రోగింది. ఈ రథోత్సవా నికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఏడుపాయల్లో జరిగే కార్యక్రమాల్లో మొదటి రోజు ఉపవాసదీక్షలు ప్రాముఖ్యత కాగా రెండవ రోజు బండ్ల ఊరేగింపు కార్యక్రమానికి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. మూడవ రోజు జరిగే రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని వనదుర్గామాతకు మొక్కులు చెల్లించుకొని వెళ్తుంటారు. ఈ రథోత్సవ కార్యక్రమాన్ని ఆనవాయితీ ప్రకారంఆలయ ఇఓ చంద్రశేఖర్ తహసిల్దార్ లు నగ్సా న్ పల్లి గ్రామానికి చెందిన బొట్టు దారులైన సాయిరెడ్డి ఇంటికి చేరుకొని బొట్టుసమర్పించి రథోత్సవ కార్యక్రమానికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో 18 బాటల పనివారు పాల్గొన్నారు. అత్యంత్య ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార క్రమం ముందుగా, ఇఓ అనవాయితీ ప్రకారం పెద్దపటే ల్ ను తీసుకొని డప్పుచపుళ్లు. మెళ తాలాల మధ్య ఎండోమెంట్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం రెవెన్యూ అధికారులను ఎదుర్కొని అమ్మవారి గుడివద్దకు వెళ్లి అక్కడి నుండి దుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా రథం వద్దకు ఎదుర్కొని వచ్చారు. అనంతరం 18 కులాలకు చెందిన పనిబాటల వాళ్లు రథం ముందు పట్టుపరిచి మంత్రాలతో దండకాలు వేస్తూ అన్నం తో పట్టుపోశారు. అనంతరం దుర్గమ్మ నామస్మరణలతో రథం లాగే కార్యక్రమం నిర్వహించారు. రథం గోలి నుండి రాత్రి 9 గంటలకు ప్రారంభంకాగా రాజ గోపురం వరకు 12గంటల వరకు కొనసాగింది. వెలదిగా తరలి వచ్చిన భక్తులు రథాన్నిలాగి తరించి పోయారు.ఈ రథోత్సవ ఈ కార క్రమంలో దుర్గమ్మ నామస్మరణ కోండా కోనల్లో ప్రతిద్వనించింది. ఈ కార్యక్రమం రాజగోపురం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని లక్షల మంది భక్తులు తిలకించితరించి పోయారు.**అబ్బురపరిచిన రథం అలంకరణ...** ఏడుపాయల జాతరలో చివరి ఘట్టమైన రథోత్సవ కార్యక్రమానికి దేవాదాయ శాఖ సిబ్బంది ఎంతో సుందరంగా రథాన్ని అలంకరించారు. వివిధ రంగులతో రథాన్ని అద్ది వివిధ రకాల పూలు, విద్యుత్ కాంతులతో అలంకరించారు. విద్యుత్ దీపాల మధ్య అమ్మవారి రథం భక్తులకు ఎంతో ఆకర్షణగా నిలిచింది. రథంలో ఉంచిన ఉత్సవ విగ్రం దేదీప్యమానంగా వెలుగొందడంతో భక్తులు దర్శించుకొని పులకరించిపోయారు.**భక్తులకు తప్పని నీటి తిప్పలు..** ఏడుపాయల జాతర లో భక్తులకు త్రాగు నీటి కష్టాలు తప్పలేదు. వేసవి కాలం ప్రారంభం నుండే ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో జాతరకు వచ్చిన భక్తులు త్రాగు నీటి కోసం ఇబ్బందులకు గురయ్యారు. అంతే కాకుండా వసతి గృహాల్లో నీరు లేక పోవడంతో బహిర్భూమికి వెళ్ళడానికి పడరాని పాట్లు పడ్డారు. జాతర నిర్వహణలో విధులు నిర్వహించేందుకు వచ్చిన పలు శాఖల అధికారులకు నీటి గోస తప్పలేదు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి వివిధ శాఖల వారు అడుగుతే ఆరు డబ్బాల నీరు కేటాయిస్తం అందులోనే త్రాగు, వంటలు , బాత్రూమ్ లకు ఉపయోగించుకోవాలని ఆ శాఖ వారికి చెప్పడం గమనార్హం.ఒక్కో శాఖ లో సుమారు వంద మంది సిబ్బంది విధులు నిర్వహించేందుకు వచ్చారు. అంతమందికి ఈ నీరు ఇలా సరిపోతుందో మరి.. కేవలం 90లీటర్ల నీరు వంద మంది సిబ్బంది సరిపెట్టు కోమనడం తో ఆయా శాఖల అధికారులు నీటి వనరులు స్వంత డబ్బులు చెల్లించి తెప్పించుకోవాల్సి వచ్చింది. జాతర లో విధులు నిర్వర్తించడానికి వచ్చిన అధికారుల పై ఇఓ కఠిన వైఖరి ప్రదర్శించడం మూలంగా జాతరలో విధులు నిర్వర్తించేందుకు రావడానికి సిబ్బంది జంకుతున్నారు.**పారిశుధ్య లోపం... భక్తులకు శాపం...** జాతర లో పారిశుధ్యం లోపించడంతో భక్తులకు శాపంగా మారింది. గురువారం ఏడుపాయల లో ప్రధాన ఘట్టం బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని తిలకించేందుకు లక్షలాది భక్తులు వచ్చారు. అయితే అంతర్గత రోడ్ల పై చెత్త చెదారం తో దుమ్ము ధూళి తో భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. అంతే కాకుండా మొక్కులు చెల్లించుకున్న భక్తులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు తిన్న విస్తరాకులు రోడ్డు ప్రక్కన పడేయడం తో పరిసర ప్రాంతాలు కంపుకొట్టాయి..



## ఆటో బోల్తా పడి విద్యార్థులకు గాయాలు

- గాయాలు అయినా విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు
- శ్రీ చైతన్య స్కూల్, సత్య సాయి స్కూల్స్ విద్యార్థులకు తీవ్ర గాయాలు
- వరుస ఘటనలు జాగుతుంటే ఆర్ఈఓ ఎం చేస్తున్నారు?
- వెంటనే ఆర్ఈఓ స్కూల్స్ యాజమాన్యాలతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలి
- విద్యార్థుల ప్రాణాలు పోతున్న పట్టించుకోనటువంటి ఆర్టిఏ అధికారులు
- ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్

**తొలి అక్షరం/షాద్ నగర్,ఫిబ్రవరి28:** ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చిన కలిసి వారికి వివరించి చెప్పిన అదే పద్ధతిన వ్యవహరిస్తున్నారు. ఏ స్కూల్ యొక్క బస్సులను మరియు ఆటోలను ఎలాంటి తనిఖీలు చేయకుండా నిమ్మకు నీరెత్తిన విధంగా ఆర్టిఏ అధికారులు చూస్తూ ఉండిపోతున్నారు.విద్యార్థులు ప్రాణాలను పుట్టగొడుగులుగా రాలి పోతున్న పాటించుకొని అధికారులు మున్నటికి మొన్న ఒక స్కూల్లో బస్సు యాక్సిడెంట్ తర్వాత మరొక స్కూల్లో ఆటో బోల్తా మరియు ఇంకొక స్కూల్లో విద్యార్థుల ప్రాణాలు ఇలా విద్యార్థుల ప్రాణాలు పోతా ఉన్నా గాని అధికారులు మాత్రం ఏమాత్రం స్పందించకపోవడం సిగ్గుచేటు ఇప్పటికైనా అధికారులు స్పందించాలి ప్రతి ఒక్క స్కూల్లో ఉన్నటువంటి బస్సుల యొక్క ఫిట్నెస్ లు చెక్ చేయాలి లేనియెడల వాటిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రంలో ఎస్ఎఫ్ఐ టౌన్ ప్రెసిడెంట్ సుమయిర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో భక్తులకు మహా అన్నదానం



**తొలి అక్షరం/మంథని:ఫిబ్రవరి 28:** మంథని పట్టణంలోని స్థానిక శీలేశ్వర,సిద్దేశ్వర ఆలయంలో భక్తులకు లోకే కుటుంబ సభ్యులు మహా అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం రోజు నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా ఆలయంలో పార్వతి, పరమేశ్వరుల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించిన మూడు రోజుల అనంతరం ఆలయ నిర్వాహకులైన లోకే కుటుంబ సభ్యులు భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా వారు ఆలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. లోకే రాధా కిషన్ రావు, కొమురవెల్లి విజయ్ కుమార్, వొడ్నాల శ్రీనివాస్, రావికంటి మనోహర్, కొమురవెల్లి జయన్న, రాజు, శ్రీనివాస్,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నూతన శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలో శాస్త్రీయంగా యువత ఆలోచించాలి

- క్రాంతి హై స్కూల్ చంద్రుగొండ ప్రధానోపాధ్యాయులు శ్రీరాముల నాగేశ్వర్






**తొలిఅక్షరం/నెక్కొండ ఫిబ్రవరి 28:** వరంగల్ జిల్లా నెక్కొన్న మండల పరిధిలోని క్రాంతి హై స్కూల్ చంద్రుగొండ లో నూతన శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలో యువత, విద్యార్థులు గ్లోబల్ లీడర్స్ గా ఎదగాలని క్రాంతి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీ రాముల నాగేశ్వర్ జాతీయ సైన్స్ డే పురస్కరించుకొని క్రాంతి హై స్కూల్ చంద్రుగొండ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షల సంవత్సరాల చరిత్ర కలిగినటువంటి హిందూ సనాతన ధర్మంలో లేనటువంటి భూమి గమనం నుంచి మొదలుకొని నక్షత్రాల గమనం వరకు ఉన్న అన్ని విషయాలను శాస్త్రీయబద్ధంగా సైంటిఫిక్ గా అర్థమయ్యే రీతిలో వివరించిన శాస్త్రవేత్తలే గొప్ప శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం గురించి ఇప్పటికీ అవగాహన తెచ్చుకోలేని భారతీయ పౌరుల యొక్క మూర?త్వానికి మరియు ఇప్పటికీ భారతీయుల కంటే విదేశాల దేశీలలో గొప్ప వాళ్ళని నమ్మే జ్ఞానం లేని అజ్ఞానులకు మనల్ని వెయ్యి సంవత్సరాలు పరిపాలించినటువంటి విదేశీయులు మన దగ్గర ఉన్న జ్ఞానాన్ని దోచుకొని మన వివిధ గ్రంథాలను లైబ్రరీలను యూనివర్సిటీలను కాల్చి మనల్ని బానిసలుగా చేసి తిండి లేని వాళ్ళగా చేసి మన జ్ఞానం ద్వారా మన భారతీయ శాస్త్ర సాంకేతిక జ్ఞానం ద్వారా 1400 సంవత్సరాల తర్వాత మన దగ్గర ఉన్న జ్ఞానం ద్వారా విజ్ఞానాన్ని కొత్త కొత్త టెక్నాలజీని కనుక్కున్నారు. అన్న విషయాన్ని కూడా గ్రహించలేని అజ్ఞానులకు సైన్స్ డే శుభాకాంక్షలు. ప్రతి విద్యార్థి నూతన పరిజ్ఞానంతో కొత్త విషయాలను ఆవిష్కరించాలన్నారు.విద్యార్థులు సైన్స్ పట్ల మరింత ఆసక్తిని పెంచుకోవాలని అన్నారు.అనంతరం పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ఎగ్జిబిట్లను తిలకించారు..ఈ కార్యక్రమంలో ,ఉపాధ్యాయ ఉపాధ్యాయునీలు ఏ, సదానందం జి, సంపత్, బి, రమేష్, సిహెచ్ సూరయ్య, సిహెచ్, రాజమౌళి, పి,సుమన్,మాధవి, రవళి, పద్మ,శిల్ప,రమాదేవి,ఫిజిక్స్ సతీష్,సుధాకర్ కొయ్యడ మిగతా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిమాన్విత పుణ్యక్షేత్రం సింగోటం లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

- సింగోటం లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- పాల్గొన్న ఎమ్మెల్సి నాగర్ కుంట నవీన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే హర్ష వర్ధన్ రెడ్డి





**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి28:** నాగర్ కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ నియోజక వర్గంలో అతి ప్రసిద్ధి చెందిన దేవాలయం గా సింగోటం లక్ష్మీనరసింహస్వామి దేవాలయం కు పేరుంది. అలాంటి ప్రసిద్ధి చెందిన సింగోటం లక్ష్మీనరసింహస్వామి దేవాలయంకు లక్ష్మీ నరసింహ స్వామి దర్శనానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత విచ్చేసారు. అదేవిధంగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హర్ష వర్ధన్ రెడ్డి, అభిల్లాష్ రావు తదితరులు సింగోటం లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి దయాకృపవలన తెలంగాణ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పి టిసి లు,ఎంపీపీ లు, ఎంపిటిసిలు సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.